సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా లక్ష్మీపతి

ప్రజాశక్తి - నిమ్మనపల్లె

గ్రామ, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా వై.లక్ష్మీపతి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఫక్రుద్దీన్ సాహెబ్, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎఒ రమేష్ బాబును కలసి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను పలమనేరు పిఆర్ఐలోని ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గ్రామ వార్డు సచివాలయాల మండల అధికారిగా ఉద్యోగోన్నతి పొంది నిమ్మనపల్లి మండలానికి వచ్చానని చెప్పారు. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని, ప్రజల సేవే పరమావధిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల విధుల సంరక్షణకు సహకరిస్తానన్నారు. గ్రామ సచివాలయాలు ప్రజల సమస్యల పరిష్కార దేవాలయాలుగా ఉండాలని సూచించారు. ప్రజలకు సచివాలయాల్లో అందుతున్న సేవలలో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుండి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ, డిఐఇపిసి) కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సింగిల్ డెస్క్ విధానం కింద గడచిన త్రైమాసికంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడచిన 45 రోజుల కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు, రెన్యువల్‌ను కోరుతూ మొత్తం పరిశ్రమల స్థాపనకు 987 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో వాటిలో 961 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన 26 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులపై నిర్దిష్ట గడువు లోపల తగిన పరిష్కారం ఇవ్వాలని, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని పర్యావరణ పరిరక్షణ, ఫాక్టరీల శాఖ, లీగల్ మెట్రోలజీ శాఖ అధికారులను, బ్యాంకు అధికారులకు ఆదేశించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి పెట్టుబడి రాయితీ, ఉత్పాదక, సేవా రంగాల్లోని 27 యూనిట్లకు రూ.57.88 లక్షల విలువైన రాయితీల ప్రయోజనాలను కమిటీ ఆమోదం తెలిపింది. పిఎంఇజిపి, పిఎం విశ్వకర్మ పెండింగ్ దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు త్వరితగతిన మంజూరు చేసే విధంగా చూడాలని ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసుకు నేందుకు అవగాహన వర్క్‌షాప్‌లను గుర్రంకొండ, వాయల్పాడు, మదనపల్లి ప్రాంతాలలో నిర్వహించడం జరిగిందని ముఖ్యంగా మహిళలకు టైలరింగ్ తదితర విషయాలలో అవగాహన కల్పించడం జరిగిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణకిశోర్ కలెక్టర్‌కు తెలిపారు. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మైన్స్, టూరిజం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై దృష్టి పెట్టాలని తెలియజేయడం జరిగిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ అవగాహన కార్యక్రమాలకు నివేదికలు తయారు చేసుకొని పూర్తి స్థాయిలో లక్ష్యాలను చేరుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో నూతన పారిశ్రామిక విధానాల అమలు విధివిధానాలను వివరించిన జనరల్ మేనేజర్, పరిశ్రమల స్థాపనకు సహకరించవలసిందిగా అన్ని పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణకిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, డిఆర్‌డిఎ పీడీ నాగేశ్వరరావు, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, ఎపిఐఐసి జెడ్‌ఎం, జిల్లా రవాణా శాఖ అధికారి, విద్యుత్ శాఖ అధికారి, డయా ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధులు ఇతర పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ముగ్గురు సైబర్ నేరగాళ్లు అరెస్టు

- రూ.32 లక్షలు నగదు, 25 ఎటిఎం కార్డులు స్వాధీనం
- ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి వెల్లడి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి కేంద్రంగా డిజిటల్ అరెస్టు, ఫేక్ సిబిఐ, ఇడి అధికారుల అవతారమెత్తి భారీ మోసాలకు పాల్పడుతు అంతర్జాతీయ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మదనపల్లివన్ టౌన్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. సోమవారం ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లికు చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగిని లక్ష్యంగా చేసుకున్నా ముఠా బాధితునికి కాల్ చేసి 'మీ పాన్ కార్డును వాడుకొని అకౌంట్స్ ఓపెన్ చేశారని, ఢిల్లీలో మీ పేరు మీద సిబిఐ, ఈడి కేసు నమోదు అయిందని మీ అకౌంట్లో రూ.48 లక్షలు డబ్బులు పడ్డాయని, రిసిప్ట్ పంపి వెంటనే రూ.48 లక్షలు డబ్బులు రిఫండ్ చేయాలని, లేకపోతే సిబిఐ ఇడి పోలీసులు అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకెళ్తారు' అని భయభ్రాంతులకు గురిచేసి రూ.48 లక్షలు కాచేశారన్నారు. నిందితులు కాంబోడియా కువైట్ కేంద్రంగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారని చెప్పారు. అమాయక ప్రజలకు వీడియో కాల్ చేసి 'మీ పేరుపై డ్రగ్స్ కేసులు, ఎఫ్ఐఆర్ ఉన్నాయని, సిఐడి, ఈడి అధికారులం' అంటూ బెదిరించి డిజిటల్ అరెస్ట్ పేరుతో బాధితుల నుండి భారీ మొత్తంలో డబ్బును వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసుకున్నారని చెప్పారు. డబ్బు పడిన వెంటనే ఎటిఎంల ద్వారా విత్ డ్రా చేసి, సిడిఎం మిషన్ల ద్వారా ఇతర ఖాతాలకు మళ్లీస్తూ వాట్సాప్ సాక్షాలను వెంటనే డిలీట్ చేస్తారని అన్నారు. సాంకేతిక నిఘాధారంగా మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో వన్‌టౌన్ సిఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ అన్సర్‌బాషా, శివకుమార్, పోలీస్ సిబ్బంది సైబర్ సెల్ సిబ్బంది హవాలా ద్వారా డబ్బులు ఎలా బదిలీ చేస్తున్నారో సదరు విషయాన్ని గుర్తించి ఎంతో చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారని చెప్పారు. నిందితుల నుండి రూ.32 లక్షలు నగదు, 25 ఎటిఎం కార్డులు, మూడు మొబైల్ ఫోన్‌లు, నాలుగు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదనంగా ఖాతాలో ఉన్న రూ.7.65 లక్షలను హోల్డ్ చేశామని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు అనే కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారని ప్రజలు ఈ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను వృద్ధులను లక్ష్యంగా చేసుకొని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. చట్టంలో డిజిటల్ అరెస్టు లేదని భారతీయ చట్టాల ప్రకారం ఏ దర్యాప్తు సంస్థ పోలీసు, సిబిఐ, ఈడి అధికారులు వీడియో కాల్ ద్వారా అరెస్టు చేయరని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది పూర్తిగా ఒక బూటకం అని తెలిపారు. వ్యక్తిగత వివరాలు గోపంగా ఉంచాలని, అపరిచితులు వీడియో కాల్ చేస్తే లిఫ్ట్ చేయకూడదని మీ ఆధార్, ఒటిపి, బ్యాంక్ పిన్ నెంబర్లు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. మీరు మోసపోయినట్లు అనుమానం వస్తే వెంటనే 1930కు కాల్ చేయాలని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. నేరగాళ్లను పట్టుకోవడంలో కృషిచేసిన పోలీస్ సిబ్బందికి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి, మదనపల్లి డిఎస్‌పి ఎస్.మహేంద్ర, మదనపల్లి వన్ టౌన్ సిఐ మహమ్మద్ రఫీ, సైబర్ సెల్ సిఐ మొహమ్మద్ అలీ, ఎస్ఐలు అన్సర్ బాష, శివకుమార్ పోలీస్ సిబ్బంది, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈనెల 31 నుండి జనవరి 4, వరకు వైజాగ్‌లో ఐదురోజుల పాటు జరగబోయే సిఐటియు అఖిల భారత18 వ మహాసభలను జయప్రదం చేయాలని వాల్ పోస్టర్లు విడుదల చేస్తూ అన్నమయ్య జిల్లాలోని కార్మిక వర్గ శ్రేణులకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ, ఓబుళమ్మ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు ఎం.సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పోస్టర్లు విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడుతూ బిజెపి అమలుచేయాలని చూస్తున్న లేబర్ కోడ్స్ వల్ల ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బిజెపి కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని పేర్కొన్నారు. ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలు నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయకుండా పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచటం దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అమోదం తెలిపిందన్నారు. కనీస వేతనాలు జీతాలు పెంచాలని కార్మికులు, స్కీం వర్కర్లుకోరుతూ ఉంటే, పెంచకపోగా, కార్మికుల పని గంటలు పెంచడంతో, వేతనాలు తగ్గిపోయాయన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, పిఎఫ్, ఇఎస్ఐ గ్రా డ్యూటీ, నిర్వీర్యం అవుతుందన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి ఇప్పుడు పెట్టుబడిదారులకు అనుకూల విధనాలు అనుసరిస్తున్నారని, కార్మికులతో పెట్టుకున్న ప్రభుత్వాలేవి మనగడలో లేవని హెచ్చరించారు. కార్యక్రమం సిఐటియు నాయకులు మాధవయ్య, సుహాసిని, సుబ్బమ్మ,దేవా, సిద్దయ్య, నాగరాజు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. స్థానిక కూటమి నాయకులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రెడ్డివారిపల్లి గ్రామ సచివాలయం వద్ద వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడు అభివృద్ధితోపాటు రైతు శ్రేయస్సు కోరుకునే నాయకుడని అన్నారు. ప్రస్తుతం వరి పంట దిగుబడి వస్తున్నందున రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు. దళారీ వ్యవస్థను నమ్ముకుని ప్రయివేట్ వ్యక్తుల చేత మోసపోరాదని సూచించారు. ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్లో 1390 ఎకరాలలో వరి పంటను సాగు చేశామన్నారు. ప్రస్తుతం 875 ఎకరాలలో పంట దిగుబడికి రావడంతో రైతులు వరి కోత ప్రారంభించారన్నారు. రైతులు ప్రభుత్వానికే వరి ధాన్యాన్ని విక్రయించాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుకు సరైన గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. మొదటి రకం వరి ధాన్యాన్ని క్వింటాకు (100 కిలోలు) రూ.2389లకు, సాధారణ రకం వరి ధాన్యాన్ని క్వింటాకు (100 కిలోలు) రూ.2369 లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వివరించారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే నగదను నేరుగా వారి బ్యాంకు ఖాతాలోకి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని కలిసి వారి ధాన్యాన్ని విక్రయించడానికి నమోదు చేసుకోవాలన్నారు. రైతులు సాగు చేసే ప్రతి పంటనూ ఇ-క్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు నేరుగా రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విత్తనాలు ఎరువులు వంటి వాటిని వివరించామన్నారు. సకాలంలో రైతులకు పంట సాగు కోసం విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులను ఆదుకోవడమే ప్రభుత్వం ముందున్న ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎడిఎ రమేష్ రాజు, ఎఒలు మంజుల, నవీన్ కుమార్ రెడ్డి, జాఫర్, సిఇఒ హరినాథ్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు, కూటమి నాయకులు ఆర్.జె. వెంకటేష్, వెంకటరమణ, రాజన్న రెడ్డప్పరెడ్డి, మునిరత్న, సుజాత పాల్గొన్నారు.

పవన్‌కుమార్ కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

సహచరులను కోల్పోవడం బాధాకరం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: విధి నిర్వహణలో సహచరులను కోల్పోవడం పోలీస్ కుటుంబానికి బాధాకరమని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ పవన్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెంద డంతో ఆయన కుటుంబానికి రూ.2.30 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డు పవన్ కుమార్ రెడ్డి మరణం వ్యక్తిగత నష్టమైతే ఇలాంటి సందర్భాల్లో సహచరులు ఆయన కుటుంబానికి అండగా నిలవడం ఒక గొప్ప సాంప్రదాయం అన్నారు. హోంగార్డ్ ఉద్యోగులు తమ ఒకరోజు అలవెన్స్‌ను విరాళంగా ఇవ్వడం మానవత విలువలకు నిదర్శనమన్నారు. ఇలాంటి సందర్భంలో వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందుతుందని, పోలీసులు బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి, రిజర్వ్ సిఐ పెద్దయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, ఎఆర్ ఎస్ఐ బాలాజీ, బాధిత కుటుంబ సభ్యులు, సహచర హోంగార్డులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : చమర్తి

ప్రజాశక్తి-రాజంపేట : రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నామని టిడిపి నియోజవకవనకగ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం, వ్యవసాయం, పారిశ్రామిక రంగం అభివృద్ధి ఎపిప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ. 57 వేల కోట్లను ప్రజల సంక్షేమం కోసం పింఛన్ల రూపంలో అందజేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అరకొరగా పింఛన్లు పంపిణీ చేసి సరిపుచ్చు కున్నారన్నారు. తల్లికి వందనం లాంటి పథకాలను అమలు చేస్తూ అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో చదువుకున్న వారికి ఉద్యోగాలు లేని పరిస్థితి ఉండేదని, నేడు గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలోనే జిల్లా కేంద్రం విషయంపై అనేక తప్పులు జరిగాయని, రాజంపేట ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించేలా ఇక్కడి ప్రజల అభిప్రాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షులు మేడికొండు రవికుమార్ నాయుడు, సొసైటీ చైర్మన్ ములుగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, ఒంటిమిట్ట మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బాసినేని వెంకటేశ్వర నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించాలి

ప్రజాశక్తి - నందలూరు : నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపిపి మేడా విజయ భాస్కర్ రెడ్డి, ఎంపిడిఒ కె.ఆర్.ఎం. ప్రసాద్‌ను స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్ రాజ్ కోరారు. సోమవారం ఎంపిపికి ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్యామ్ రాజు మాట్లాడుతూ పెరిగిన మొక్కలను ఉపాధి కూలీలతో తొలగించాలని తెలిపారు. చుట్టు ప్రక్కల ప్రాంతంలో ఉన్న ఆవులు, బర్రెలు, పందులు క్రీడామైదానంలోకి వచ్చి అపరిశుభ్రం చేస్తున్నాయని, జంతువులు వేసిన పేడపై కాళ్లు పెట్టి పరిగెతునప్పుడు జారిపడుతున్నాని చెప్పారు. క్రీడాకారులకు, వాకింగ్ చేసేవారికి చాల ఇబ్బంది ఉందని పేర్కొన్నారు. తూర్పు భాగాన స్కూల్ ప్రక్కన చిన్న దారి ఉందని, ఆ దారి గుండ జంతువులు వస్తున్నాయని, ఆదారిని మూసివేయాలని కోరారు. రాత్రి పూట పెద్ద గేటు కూడా తాళంవేయాలని, క్రీడాకారులు క్రీడామైదానంలోకి వెళ్లేందుకు రౌండ్ గేట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణలో భాగస్వాములై, నిరంతరం ఎయిడ్స్ నియంత్రణ కోసం కృషి చేస్తున్న ఆర్ఆర్ఎస్ సంస్థ మేనేజర్ పురుషోత్తం, మదనపల్లె ఎఆర్‌టి సెంటర్ ఉద్యోగి జయరాజ్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. సోమవారం ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రాయచోటిలో డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రాధిక వారికి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. రాబోయే కాలంలో ఎయిడ్స్ నియంత్రణకు మరింతగా పనిచేయాలని సూచించారు.

నిమ్మనపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమవుతుందని, ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్ అన్నారు. సోమవారం జిల్లా ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలసి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కళాశాల వద్ద నుంచి రెవెన్యూ కార్యాలయం, పెట్రోల్ బంక్, పోలీస్ స్టేషన్, వెంకోజీగారిపల్లె మీదుగా నిమ్మనపల్లి బస్టాండ్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలి వద్ద నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, జూనియర్ కళాశాల విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ, నివారణ, చికిత్సలపై, సురక్షిత కలయికలపై ఫ్లకార్డులు పట్టుకొని, బ్యానర్లతో ర్యాలీ చేస్తూ కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రామాంజులు, రిబ్బన్ క్లబ్ పిఒ రఘు, అధ్యాపకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తెలిపారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్-ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఫ్ల కార్డులు చేత పట్టుకొని కళాశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాలంటీర్లు పాల్గొన్నారు. **మదనపల్లె టౌన్ :** స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివ్ పార్వతి దేవి, నర్సింగ్ అధ్యాపకురాలు చంద్రకళ, కళాశాలలోని అధ్యాపకులు శ్రీదేవి, మాలతితో పాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితోపాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** చేయి.. చేయి కలుపుదాం ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం అంటూ ఆదర్శ ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు మేరి పిలుపునిచ్చారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెంగళూరు బస్టాండ్ వరకు ర్యాలీ ఆసగింది. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకూ వేళ్లూనుకుపోతున్న హెచ్ఐవి, ఎయిడ్స్‌ను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో అధిక శాతం విద్యావంతులే అయినప్పటికీ క్షణిక సుఖం కోసం అడ్డదారులు తొక్కుతూ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వం వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తున్నా, స్వచ్ఛంద సంస్థలు కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా, ప్రజల్లో స్వతహాగా మార్పు వచ్చినప్పుడే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమౌతుందని చెప్పారు. అనంతరం ఆదర్శ ఉమెన్ డెవెలెప్మెంట్ సంస్థ ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న బాధితులకు చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని బెడ్ షీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఆర్‌టి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హుమన్ బాష, డాక్టర్ మేఘన, ఎఆర్‌టి కౌన్సిలర్ జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశలన్నీ టమోటాపైనే..

కడప జిల్లాలో వేల ఎకరాల్లో సాగు

ఆశాజనకంగా ధరలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో రబీ సీజన్‌లో రైతులు టమోటా పంటను సాగు చేపట్టారు. జిల్లాలో అధికంగా మైదుకూరు మండలపరిధిలో టమోటా పంటను రైతులు సాగు చేపట్టారు. మండల పరిధిలోనే 6 వేల ఎకరాల వరకు టమోటా పంటను రైతులు సాగు చేపట్టారు. దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాలలో 2 వందల ఎకరాలలో, ఇతర మండలాలలో 50 ఎకరాలలోపు టమోటాను రైతులు చేపట్టారు. ముందుగా సాగుచేసిన టమోటా దిగుబడి వారం, పది రోజుల్లో ప్రారంభంకానుంది. డిసెంబర్ మొదటి వారం నుంచి టమోటా దిగుబడి అధికంగా రానున్నది. టమోటా ఎకరా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు రూ. 30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 50 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం మన ప్రాంతంలో అమ్మకాలు చేపట్టే టమోటా మదనపల్లి, చిత్తూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మైదుకూరు ప్రాంతంలో ముందస్తుగా సాగుచేసిన పంట 30 కిలోల బాక్స్ ధర రూ. 800 పలుకుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రాబోయే నెలరోజుల పాటు వర్షాలు నమోదైతే పంట దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ఈ ఏడది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉల్లి పంట అధిక వర్షాలకు దెబ్బతిని దిగుబడులు పూర్తిగా తగ్గాయి. నూర్పిడి సమయంలో ధరలు కూడా గణనీయంగా తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. క్వింటా రూ.500 మాత్రమే ఉల్లి గడ్డలు పలికాయి. ఉల్లి సాగుచేసిన రైతులు అన్ని విధాల నష్టపోయారు. రైతులు ఆశలని టమోటా పంటపై ఉన్నాయి. 30 కిలోల బాక్స్ ధర రూ. 300 నుంచి రూ. 600 రూపాయల వరకు గత ఏడాది అమ్మకాలు జరిగాయి. కేవలం ఈ ఏడాది ఒక నెలపాటు ఈ ధరలు ఉంటే ఎకరాకు రూ. 50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా టమోటా పంటలో వారానికి 100 బాక్సుల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ధరలు కాస్త ఉంటే ఎరువులు, పురుగుమందులు పిచికారి చేసి పంటను జనవరి చివరి వరకు కాపాడుకోవచ్చుని రైతులు సూచిస్తున్నారు. ప్రస్తుతం సాగుచేసిన టమోటా పంట ఆశాజనకంగా ఉందని పురుగు బెడదకూడా కాస్త తక్కువగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.30 వేలు ఖర్చులవుతున్నాయి

టమోటా సాగుకు ఎకరాకు రూ. 30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ధరలు ఏ విధంగా ఉంటాయో అని ఆందోళనగా ఉంది. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు అధికమయ్యాయి. దిగుబడులు చేతికి వచ్చే సమయానికి ధరలు ఉండడం లేదు. టమోటా ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావిస్తున్నాం.

- సంజీవరెడ్డి, టమోటా రైతు, ఉత్సలవరం.

పంట ఆశాజనకంగా ఉంది

టమోటా పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఈ నెల చివరి నాటికి దిగుబడులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం ధరలు 30 కిలోల బాక్స్ రూ. 750 వరకు పలుకుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పెరుగుతాయని భావిస్తున్నాం. అధిక వర్షాలు పడకపోతే టమోటా ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

- సుబ్బారాయుడు, టమోటా రైతు, వెంకటాపురం.

రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

రైతును రాజును చేయడమే లక్ష్యం : చమర్తి

ప్రజాశక్తి-రాజంపేట

ప్రపంచానికి ఆహారాన్ని అందించే రైతును రాజును చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని మందరం గ్రామపంచాయతీలో 'రైతన్న... మీకోసం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగించుకోవాలని, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, టిడిపి మండల రూరల్ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, దివాకర్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన.. తుపాన్ నేపథ్యంలో అత్తిరాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం చమర్తి జగన్మోహన్ రాజు పరిశీలించారు. పునరావాస కేంద్రంలో తాగునీరు, ఆహారం, విద్యుత్తు, వైద్య సదుపాయాలు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని బాధితులను పరామర్శించి సహాయాలపై ఆరా తీశారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌ఛార్జి అధికారిగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డిని సోమవారం టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన అబ్దుల్ కలాం ఆజాద్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు పిటిఎం డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు. సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప శ్రీకంఠరెడ్డి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కిట్టన్న సికిందర్ నాగార్జున చిన్నపరెడ్డి మహబూబ్ బాషా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహల్ సిహెచ్‌సిలో మెరుగైన సేవలు

- సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - కలికిరి

మాట్లాడుతున్న ప్రశాంతి

మహల్ సిహెచ్‌సిలో మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మహల్ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం ఎంతో విశాలమైన భవనంలో ఏర్పాటైందని, అందులో రోగులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. వార్డులు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయని, అన్ని విభాగాలు వ్యాధులకు సంబంధించిన 8 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. మహిళలకు సంబంధించిన అన్ని వ్యాధులకు చికిత్స చేయడానికి ప్రత్యేక వైద్యులు ఉన్నారని, సురక్షిత ప్రసవాలు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వంటివి విజయవంతంగా చేస్తున్నామని వివరించారు. అత్యవసర గుండెపోటు కేసుల కోసం రూ. 40,000 విలువచేసే టీపీఎ ఇంజక్షన్లు సైతం ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ పనిచేసే సిబ్బంది సహకారంతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చుట్టుపక్కల గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

బండమీద దళితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు: మండలంలోని బండమీద దళితవాడలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ శివశంకర్‌ను గ్రామ స్తులు కోరారు. సోమవారం ఎబిఎంఎస్‌జెఎసి ఆధ్వర్యంలో వై. వెంకటరమణ అధ్య క్షతన గ్రామస్తులు ఎంపిడిఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమస్య పరిష్కారానికి తాము అనేకసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు సమర్పించినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయినేజీల్లో నిల్వ ఉన్న నీరు తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. దోమలు ఎక్కువగా పెరగడంతో పిల్లలు, పెద్దలు విషజ్వరాలతో పాటుఇతర రోగాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషమ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎబిఎంఎస్‌జెఎసి రాయలసీమ కన్వీనర్ గుర్రం నారాయణ, జిల్లా అధ్యక్షులు నక్క వెంకటరమణ, జిల్లా కార్యదర్శి మద్దెల రమేష్, నాయకులు లోకనాథం, సురేంద్ర, శివ, నాగేంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

అధికారులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-పీలేరు: ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు తగిన న్యాయం చేస్తామని పీలేరు తహశీల్దారు శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్లో విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా మరుగున పడిన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గతంలో అధికారులు ఇళ్లు నిర్మించుకునేందుకు, మాజీ రెవెన్యూ అధికారులకు కేటాయించిన స్థలాలు ఏ గ్రామ పరిధిలోకి వస్తాయో తెలుసుకుని, వాటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు చొరవ చూపుతానని తహశీల్దారు అన్నారు. వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన పలువురు అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారుకు వినతి పత్రం సమ ర్పించారు. స్పందించిన తహశీల్దారు మండల సర్వేయర్ కు పరిస్థితి వినిపించి తక్షణం విశ్రాంత ఉద్యోగుల సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన ఆదేశిం చారు. భవిష్యత్తులో మనం కూడా ఏ 10 లేదా 20 ఏళ్లకో పదవి విరమణ పొం దక తప్పదని, మన విధి నిర్వహణలో ఉండగా పదిమందికీ మంచి సేవలు అం దిస్తే, భవిష్యత్తులో అవి మనకు ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో ఉద్యోగ విరమణ పొందిన పలువురులు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శివకుమార్

నాణ్యతతో అభివృద్ధి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పథకాలు, పనులను త్వరితగతిన, నాణ్యతతో అమలు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఇఒఆర్‌డిలు, డ్వామా ఇఇలు, డిఇలు, ఎఇలు, గృహనిర్మాణ శాఖ అధికా రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఈనెల 5న మెగా పిటిఎం సంసిద్ధత, రైతన్న-మీకోసం, వివిధ ప్రాధాన్యతా ప్రాజెక్టులకు భూసేకరణ, కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న పరాయీకరణ ప్రతిపాదనలు, పిజిఆర్ఎస్ పరిష్కారం-అత్యధిక పునఃప్రారంభం, ఆడిట్ హైలైట్ చేసిన కేసులు ఉన్న మండలాలు, వాట్సాప్, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న సాసా కార్యక్రమానికి సంబంధించి డోర్ టు డోర్ చెత్త సేకరణ, శానిటేషన్ పనులలో పురోగతి సాధించి ప్రభుత్వం సేకరిస్తున్న ఐవిఆర్ఎస్ కాల్స్‌లో జిల్లా స్థానాన్ని మెరుగుప రిచేందుకు ఎంపిడిఒలు, డిప్యూటీ ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో మొలకలచెరువు పెద్దమండెం, సంబేపల్లి, రామసముద్రం,పుల్లంపేట కార్యక్రమంలో చాలా వెనుకబడి ఉన్నాయని, ఈ మండలాలు పురోగతి సాధించాలని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రీన్ అంబాసిడర్లు చెత్త సేకరణ డోర్ టు డోర్ కలెక్షన్ ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించి వారితో సమావేశాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలో మెరుగుపడేందుకు కృషి చేయాలని అన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఆవాస్ ప్లస్ సర్వే జిల్లాలో హౌసింగ్, ఇంజనీరింగ్, ఎంపిడిఒ అధికారులు చాలా బాగా చేశారని, ఇంకను మిగిలి ఉంటే రెండు వారాలలో పూర్తిచేయాలని ఆర్‌ఎల్, ఆర్‌సి, స్టేజ్ కన్వర్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర స్థాయి జిల్లాస్థాయిలో ఆర్థిక మెరుగుపడేందుకు గృహ నిర్మాణ పనులు ఎంతగానో తోడ్పడతాయని, వీటిని పూర్తి చేయడం వల్ల జిల్లా ప్రగతి, అభివృద్ధి ఎంతగానో మెరుగుపడుతుందని అన్నారు. ఇంకను గృహ నిర్మాణ పనులు

మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రారంభించని పూర్తి చేయని లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణం పనులను పూర్తిచేసుకునే విధంగా తీసుకోవాలని లేకుంటే రాబోయే కాలంలో మరలా గృహ నిర్మాణం మంజూరు కాదనే విషయాన్ని తెలియజేయాలని పేర్కొన్నారు. రైతన్న మీకోసం సర్వే కార్యక్రమం ఆర్ఎస్‌కె సిబ్బంది చాలా బాగా చేశారని కార్యక్రమంలో రైతులతో చర్చించిన అనేక విషయాలను, సలహాలను రైతు సేవా కేంద్రాలలో ఈనెల 3న జరిగే వర్క్ షాప్‌లో ఇంకా లోతుగా చర్చించాలని తెలిపారు. ఎంఐ ట్యాంకుల గురించి, వాటర్ సెక్యూరిటీ గురించి ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలో చర్చించాలని అధికారులకు తెలియజేశారు. సర్వే ఫేస్ -2 పనులలో జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు తలెత్తకుండా నాణ్యతతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్వామిత్వ పనులలో పురోగతి సాధించాలని, పిజిఆర్ఎస్ సంబంధించిన అర్జీలను నాణ్యతతో సరైన ఇండోర్స్ చేస్తూ పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ మధుసూదన్ రావు, సిపిఒవెంకటట్, ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, డిపిఒ రాధమ్మ, పర్యాటక శాఖ భూషణం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి. శివ నారాయణ , హార్టికల్చర్, సిరికల్చర్, డ్వామా, ఇరిగేషన్, డిఇఒ, హౌసింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, ఫిషరీస్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

కలకడ : పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-కలకడప

మండలంలోని బాటవారిపల్లిలో సోమవారం ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని నగదును లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులు, వితంతు, వృద్ధాప్య పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి వద్దనే పెన్షన్ అందుతుందా, ఏ రోజు పింఛను అందుతోంది, ఎన్ని గంటలకు ఇస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నాగేశ్వరరావు, తహశీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపిడిఒ భానుప్రసాద్, ఎపిఒ సుజాత, ఎపిఎం పురుషోత్తంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నందిని, శైలజ, దేవేంద్ర, ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్ :** చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో ఆశించిన అభివృద్ధి జరుగుతోందని రాయచోటి రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు గండికోట సుధాకర్ అన్నారు. సోమవారం ఉదయం రూరల్ మండలంలోని చెన్నముక్కపల్లె గ్రామ పరిధిలో అధికారులతో కలిసి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు. లక్ష్మి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి అభి వృద్ధి పథంలో సాగుతుందన్నారు. మండిపల్లి సోదరులు నిత్యం ప్రజాదర్బార్‌లను నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే పనులు చేపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టిడిపి కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మూగి రెడ్డప్ప మండలంలోని ప్రతి గ్రామం తిరు గుతూ పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ క్రమం తప్పకుండా ప్రతినెలా 1న ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీ చేయడం టిడిపి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. **మదనపల్లె అర్బన్:** ఎపిలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని మదనపల్లి ఎపిఎస్‌ఆర్‌టిసి-1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి పేర్కొన్నారు. 14వ వార్డులో లబ్ధిదారులకు సచివాలయ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. **మదనపల్లె :** పట్టణంలో సాయిబాబా గుడి వీధి, నిమ్మనపల్లి సర్కిల్, పాయి రామన్న వీధిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పంపిణీ చేశారు. అనంతరం బసినకొండ కస్పా, రామాచార్లపల్లి, నిమ్మలపల్లి మండలం రాచవేటి వారి పల్లెలో అర్హులకు ఎమ్మెల్యే చేతుల మీదగా పెన్షన్లను అంద జేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ నవీన్ చౌదరి, కత్తి లక్ష్మన్న, బాలు స్వామి, మల్లికార్జున్ నాయుడు, ఆర్జె వెంకటేష్, నరసింహారెడ్డి, మదనపల్లి ఎంపీడీవో తాజ్మస్రూర్, డిప్యూటీ ఎంపీడీవో తిరుపాల్ నాయక్, చిన్న మహేష్, గుట్ట రమణ, కార్తీక్, నారాయణస్వామి, లోకేష్, ప్రతాప్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రాయచోటి : పింఛను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు సుధాకర్

సబ్ కలెక్టర్ వినతిపత్రం ఇస్తున్న పట్టణ వాసులు

శ్రీకృష్ణ దేవరాయులు జిల్లాగా నామకరణం చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: నూతనంగా ఏర్పాటు చేసిన మదనపల్లి జిల్లాకు శ్రీకృష్ణ దేవరాయులు మదనపల్లి జిల్లాగా అధికారికంగా నామకరణం చేయాలని రాయల్ యూత్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు రేగడి ప్రసాద్ కుమార్, బలిజ సామాజిక వర్గం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో బలిజ నాయకులు ముని గోపా లకృష్ణ, రాయల్ గణి, జయరాం, వేణన్న, కొండయ్య, పసుపులేటి వరప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేశ్, రామచంద్ర, చక్రిలతో కలిసి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతికి శాశ్వత కీర్తి తీసుకువచ్చిన అఖండ భారతదేశ చక్రవర్తి, సాహిత్య సంస్కృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేసిన మహా మహు డు శ్రీకృష్ణ దేవరాయులన్నారు. రాష్ట్రంలో 28 శాతం జనాభా కలిగిన బలిజల న్యాయమైన డిమాండును ప్రభుత్వం పరిగణలోకి తీసుకో వాలన్నారు.

వీరబల్లిని రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలపాలి

ప్రజాశక్తి-వీరబల్లి: వీరబల్లి మండలాన్ని రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలిపి సమన్యాయం చేయాలంటూ తహశీల్దార్ ఖాజాబీకి సోమవారం విఆర్‌డిఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, పెద్దివీడు సర్పంచ్ తాటిగుట్ల నాగిరెడ్డి, తాటి గుంటపల్లి సర్పంచ్ గోపినాథ్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సరిహద్దుల్లో ఉన్న వీరబల్లి మండలం 20 కిలోమీటర్లలోపే ఉందని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మాకు రాయచోటి డివిజన్‌లో కలిపితే వీరబల్లి మండలం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాజంపేట వెళ్లాలన్నా కనీసం బస్సు సౌకర్యం లేదన్నారు. 60 కిలోమీటర్ల దూరంతో పాటు రెండు ఘాట్ సెక్షన్లు దాటుకొని రాజంపేట చేరుకోవాలని తెలిపారు. జిల్లాల పునర్వ విభజన కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా నుండి మదనపల్లి విడి పోయి జిల్లా అవుతోంది రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి, సుండుపల్లి మండలాలను రాయచోటి రెవెన్యూ డివిజన్లో కలిపితే అన్ని విధాలుగా రెవిన్యూ ఉద్యోగులకు, ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం కడప రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కేడర్ ప్రమోషన్స్ చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్నా యని తెలిపారు. వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తల నుంచి మహిళా సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు కల్పించాలని చెప్పారు. ఏళ్లుగా సర్వీసులో ఉన్నా ఉద్యోగోన్నతలు దక్కలేదని పేర్కొన్నారు. ఆర్‌డి స్పందిస్తూ సీనియార్టీ లిస్టు తయారుచేసి ఉద్యోగోన్నతలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, అనంతపురం జిల్లా అధ్యక్షలు వి.చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి డి.చంద్ర మోహన్, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, సొసైటీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రొద్దుటూరు అధ్యక్షులు రామ సుబ్బయ్య, జిల్లా మహిళా చైర్మన్ యస్. జమీల బేగం, జిల్లా నాయకులు లక్ష్మీనరసమ్మ, రాజేశ్వరి, మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్ జోరుగా సాగుతున్నాయి. వైఎస్.రాజారెడ్డి, ఎసిఎ స్టేడియంలో సోమవారం రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, సౌత్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు 72 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. ఆ జట్టులోని మొహమ్మద్ ఇజ్వార్ 89 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. రక్షణ సాయి 51 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని ఉనయిస్ మూడు, నాగ వెంకట జత్విక్ నాలుగు వికెట్లు తీసుకున్నారు.

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నార్త్ జోన్ విన్నర్స్, సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్ జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. ఆ జట్టులోని అక్షిత్ రెడ్డి బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించాడు. 237 బంతులను ఎదుర్కొని 18 బౌండరీల సహాయంతో 137 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్‌గా నిలిచాడు. విగ్నేష్ 49 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టులోని రామ్ కిరణ్ విన్నీ నాలుగు, సిద్ధిక్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి ఒక ఓవర్ బ్యాటింగ్ చేసి పరుగులేమి చేయలేదు.

కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్, రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 69.5 ఓవర్లలో 181 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి కృష్ణ చైతన్య 88, తాహీర్ 46 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని నందన్ కృష్ణ సాయి 2, దీక్షిత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసింది. ఆ జట్టులోని పండిత్ 36 పరుగులు చేశాడు.

ఉరుసు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి, ఎంపిపి మేడా

ఐక్యతకు నిదర్శనం ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని టంగుటూరులో వెలిసిన శ్రీ శ్రీ హజరత్ ఖాదరవల్లి సాహెబ్ 469 ఉరుసు ఉత్సవం హిందూ ముస్లిముల ఐక్యతకు నిదర్శనం అని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, సిద్ధవటం వైసిపి ఇన్‌ఛార్జి మేడా మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. టంగుటూరు ముస్లిం కమిటీ మాజీ చైర్మన్ షేక్ షావల్లి, ముస్లిం కమిటీ చైర్మన్ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో బాణ సంచా, డప్పు వాయిద్యాల నడుమ వీరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సీనియర్ విభాగం ఎద్దుల బండ లాగుడు పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నందలూరు మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, మండల్ కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, అరిగేల సౌమిత్రి, గుండు మల్లికార్జున రెడ్డి, గంగినాయుడు, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, మంచా మురహరి, భాస్కర్ యాదవ్, ఇబ్బు, మధు యాదవ్, మహబూబ్ బాషా, గోల్డ్ మస్తాన్, ఖాదర్ వల్లి, శంకర్, శివ, ఆంజనేయులు, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

సంత రోడ్డుకు మోక్షం

- తాత్కాలికంగా మరమ్మతు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బస్టాండ్ వెనుక వైపున కూరగాయల సంతకు మోక్షం లభించింది. కంకర వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ప్రతి బుధవారమూ నిర్వహించే సంతకు మండలంలోని 17 పంచాయతీల్లోని ప్రజలతోపాటు రైతులు వస్తుంటారు. ముఖ్యంగా పెద్దమండెం, కలిచెర్ల, రాయచోటి, ఎన్‌పి కుంట, కదిరి చుట్టుపక్క పట్టణాల నుంచి వ్యాపారులు సంతలో వ్యాపారం చేస్తుంటారు. సంతలోప్లాట్‌ఫారం లేకపోవడంతో బస్టాండ్ నుంచి సంతలోకి వెళ్లాలంటే చిత్తడి వల్ల ఇబ్బందులు పడేవారు. సోమవారం జెసిబి యంత్రాన్ని ఉపయోగించి మట్టినంత తొలగించారు. మంగళవారం కంకర ద్వారా రోడ్ ఫార్మేషన్ చేసి తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నామని ఉప ఎంపిపి మిట్టపల్లి. యదుభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. సిమెంట్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే జనవరిలో ఏర్పాటు చేస్తామని అని పేర్కొన్నారు. ఇప్పటికే సంత మధ్య భాగంలో ఎల్ఇడి వీధిలైట్లు వేశామన్నారు. రాబోయే రోజుల్లో సంతకు ఫ్లాట్‌ఫామ్ షెడ్యూల్ ఏర్పాటు చేసి వర్షం వచ్చినా రైతులకు, ప్రజలకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా చక్రపాణి

ప్రజాశక్తి- కలకడ

మాట్లాడుతున్న చక్రపాణి

మండల గ్రామ వార్డు సచివాలయాల అధికారిగా చక్రపాణి పదవి బాధ్యతలు చేపట్టారు. మండల కేంద్రమైన కలకడలోని గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా చక్రపాణి సోమవారం బాధ్యతలు చేపట్టారని ఎంపిడిఒ భాను ప్రసాద్ తెలిపారు. చక్రపాణి గతంలో వాల్మీకి పురం మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసి స్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై కలకడ మండల డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల గ్రామ వార్డు సచివాలయాల అధికారి చక్రపాణి మాట్లాడుతూ మండలంలో ఉన్న గ్రామాల వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఎల్లవేళలా కృషి చేస్తారని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

సైబర్ నేరాలపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. సోమవారం మదనపల్లె మండలం, తట్టివారిపల్లి సచివాలయ పరిధిలోని ప్రజలతో అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ ఇటీవల ప్రజలను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారన్నారు. ఇలాంటి నేరాల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లు, లింకులను ఎటువంటి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదన్నారు. తాము సిబిఐ పోలీసులమని, ఇతర శాఖల అధికారులమని నమ్మించి బ్లాక్ మెయిల్ చేస్తూ వీడియో కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే మీ పరిధిలోని పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయాలన్నారు. డిజిటల్ అరెస్ట్ లంటూ ఎవరైనా భయభ్రాంతులకు గురిచేస్తే అలాంటి అపోహలు నమ్మవద్దన్నారు. డిజిటల్ అరెస్టులు అనేవి పోలీస్ శాఖలో లేవని ఈ విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకుని మోసపోకుండా అప్రమత్తం కావాలన్నారు. కార్యక్రమంలో తట్టివారిపల్లి గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

4న రాయచోటిలో అభినందన సభ

ప్రజాశక్తి-రాయచోటి: రాయచోటి జిల్లా కేంద్ర హోదాను కొనసాగించినందుకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతగా ఈ నెల 4వ తేదీన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు కృతజ్ఞత, అభినందన సభను ఏర్పాటు చేయనున్నట్లు ప్రయివేట్ విద్యా సంస్థల జెఎసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన మోహ న్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్‌వి విద్యామందిరంలో జరిగిన ప్రయివేట్ విద్యా సంస్థల యజమానుల సమావేశంలో కార్యక్రమ వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రయివేట్ విద్యాసంస్థల ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రతిభాకళాశాల గంగిరెడ్డి, ప్రభాకర్, చలమారెడ్డి, రాజారెడ్డి, రాజశేఖర్, భాస్కర్, ఆనందరెడ్డి, టీచర్స్ అసోసియేషన్ నాయకుడు రెడ్డెప్పరెడ్డి, అపస్మా, జూనియర్, డిగ్రీ కళాశాలల సంఘ నాయకులు, తదితర కరెస్పాండెంట్‌లు, ప్రిన్సిపల్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

నాటుసారా విక్రయిస్తున్న మహిళను సోమవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ భీమలింగ కథనం మేరకు మదనపల్లె మండలం నారమాకుల తండాకు చెందిన హరిత అక్రమంగా ఐదు లీటర్ల నాటు సారాను ఇంట్లో పెట్టుకుని విక్రయిస్తోందని, సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా, అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఐదు లీటర్ల నాటు సారా దొరకడంతో సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. అనంతరం ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సిటిఎం రోడ్డు బాలాజీ నగర్ కు చెందిన సుభాష్ కుటుంబ సమస్యలపై ఇంట్లో గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న నెయిల్ పాలిష్ తాగి, ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాధితుడిని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్సలు అందిస్తున్నారు. సకాలంలో వైద్యం అందించడంతో సుభాష్ ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.